
కేసీఆర్ చేసిన పనులతోనే సిట్ నోటీసులు
● ఫోన్ ట్యాపింగ్‌పై సమాచారాన్ని పోలీసులకు అందిస్తా
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ 6

ప్రభుత్వ మెడలు వంచి
రూ.6వేల పింఛన్ సాధిస్తాం
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


# కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు

- డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీ
- రేసులో పద్మాకర్‌రెడ్డి, వెలిచాల
- ఆశల్లో అంజన్‌కుమార్, సత్యప్రసన్న, ఆకారపు
- మంత్రుల మద్దతు, అధిష్ఠాన ఆశీస్సులే కీలకం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణంపై దృష్టిసారించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అధికారంలో లేకపోవడం, ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చినా అటు సంస్థాగత పదవులు గానీ, ఇటు నామినేటెడ్ పదవులు దక్కక నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, క్రియాశీల కార్యకర్తలు, గ్రామీణస్థాయి నాయకుల్లో ఇప్పుడు ఉత్సాహం మొదలైంది. పార్టీ అధిష్ఠానవర్గం సంస్థాగత పునర్నిర్మాణంపై దృష్టిసారించడమే కాకుండా ఉమ్మడి జిల్లాల స్థాయిలో ఇన్‌చార్జీలను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించడంతో వారు తమకు అప్పగించిన బాధ్యతల్లో పనిచేయడం ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లా సంస్థాగత ఇన్‌చార్జి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఉమ్మడి జిల్లా పరిధి లోని జిల్లాల్లో పర్యటన ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక జిల్లా ఉపాధ్యక్షున్ని, ప్రతి బ్లాక్ నుంచి ఒక ప్రధాన కార్యదర్శిని, ప్రతి మండలం నుంచి ఒక కార్యదర్శిని తీసుకుంటామని ప్రకటించారు. క్షేత్రస్థాయి నేతలు ఆయా పదవుల కోసం అప్పుడే తమ ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కూడా తీవ్రమైన పోటీ నెలకొన్నది.

### ప్రయత్నాలు ముమ్మరం చేసిన నేతలు

సంస్థాగత ఇన్‌చార్జి ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేయడంతో డీసీసీ పదవిని ఆశిస్తున్నవారు అలర్ట్ అయి అందుకు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రధానంగా పదవి కోసం ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్లమెంట్ స్థానానికి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి పోటీ పడుతున్నారు. వీరంతా వారి వారి స్థాయిల్లో అటు మంత్రులతో, పార్టీలో కీలక నేతలతో కలిసి తమకు పదవి లభించేలా చూడాని కోరుతున్నట్లు సమా చారం. కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి జిల్లాలోనే ఉన్న అద్దంకి దయాకర్‌ను కలిసి తాను ఎన్‌ఎస్‌యూఐ నుంచి పార్టీ ప్రస్థానం ప్రారంభించి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి వరకు వచ్చి అంకితభావంతో పనిచేస్తున్నానని, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, సింగిల్‌విండో చైర్మన్‌గా, మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా గత రెండు దశాబ్దాలుగా సేవలందించానని, తన కష్టాన్ని గుర్తించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

డీసీసీ అధ్యక్ష పదవిని మొదటి నుంచి ఆశిస్తూ వస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన నగర అధ్యక్షుడిగా పనిచేస్తూ వచ్చి డీసీసీ పదవి కోసం చాలాకాలం ప్రయత్నాలు చేశారు. డీసీసీ పదవి నియామకం కాకముందే సుడా చైర్మన్ పదవి దక్కడంతో ఆ పదవిని చేపట్టారు. ఆయనకు డీసీసీ బాధ్యతలు చేపట్టాలని ఉన్నా ఇప్పటికే ఒక పదవి ఉండడంతో అది అంత సులువుగా దక్కకపోవచ్చని భావించి ప్రయత్నాలు విరమించుకున్నట్లు తెలుస్తున్నది. పార్టీ పదవి బాధ్యతలు అప్పగిస్తే మాత్రం తప్పక నిర్వహిస్తానని అంటున్నట్లు సమాచారం. పీసీసీ కార్యదర్శిగా ఉన్న అంజన్ కుమార్ కూడా తాను పార్టీని వదలకుండా తొలి నుంచి అంటిపెట్టుకుని ఉన్నానని, తాను డీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా అర్హునిగా ఉన్నానని పేర్కొంటూ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం.

మరో సీనియర్ నేత ఆకారపు భాస్కర్ రెడ్డి కూడా డీసీసీ పదవిని ఆశిస్తున్నారు. ఆయన కొంతకాలం టీఆర్‌ఎస్‌లోకి వెళ్లి రావడంతో పార్టీలో మిగతా 8వ పేజీలో

# 42% రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలి

● కార్యకర్తలు పార్టీ కోసమే పనిచేయాలి
● గ్రూపు రాజకీయాలు చేస్తే టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తి లేదు
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ స్టాండ్ చాలా క్లియర్‌గా ఉందని, 42శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే అందజేస్తానంటే ప్రధాని మోదీని ఒప్పించి బిల్లును అమోదించేందుకు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 1,037 సైకిళ్లను పంపిణీ చేశారు.

అనంతరం జరిగిన సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 42శాతం రిజర్వేన్లలో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తానంటే ఒప్పుకునే ప్రసక్తి లేదన్నారు. బీజేపీలో ఏ గ్రూపు లేదని, ఉన్నదల్లా మోదీ గ్రూప్ అన్నారు. బీజేపీలో ఈ వర్గం ఆ వర్గమంటూ ఉండదన్నారు. జెండా, పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీలో వ్యక్తి కోసం పనిచేస్తే ప్రోత్సహించే ప్రసక్తి లేదన్నారు. బీజేపీలో కష్టపడ్డ వారికి ఎంపీ ల్యాండ్స్, ఈజీ ఎస్ నిధులను అందిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపుల పేరుతో రాజకీయాలు చేస్తే టిక్కెట్లు ఇచ్చేది లేదన్నారు. కష్టపడ్డ వారికే టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటామన్నారు. కరీంనగర్ పార్ల మెంట్ పరిధిలో రూ. 219 కోట్లు సీఆర్‌ఐఎఫ్ నిధులను తీసుకొచ్చి రోడ్లు వేయిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం బోర్లు వేయిస్తున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నేను 2.25 లక్షల మెజార్టీతో గెలిచానంటే దానికి కారణం కార్యకర్తల కష్టమేనన్నారు. బనకచర్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాన్ని పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. జల వివాదాలపై బీఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయన్నారు.

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృష్ణా జలాలను ఏపీకి తాకట్టు పెట్టిందన్నారు. ఈ ప్రభుత్వం కూడా అదే పంథాలో ఉన్నట్లుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇరిగేషన్ అధికారుల అవినీతిని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయన్నారు. కాళేశ్వరంలో కేసీఆర్ కుటుంబం భారీ ఎత్తున దోచుకుందన్నారు. కేసీఆర్ కుటుంబంపై ఎన్నో అవినీతి కేసులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కేసు విషయంలో కూడా కేసీఆర్ కుటుంబాన్ని దోషులుగా తేల్చలేకపోయిందన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉందని, నూతన భవనాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పాఠశాల హెచ్‌ఎం బొరగాల తిరుమల, ఉపాధ్యాయులు పల్కల ఈశ్వర్ రెడ్డి, ఆసియాలు కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని వాకాడి, ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ మాధవి, తహసీల్దార్ కనకయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, డీఈవోలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న బండి సంజయ్‌కుమార్

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు: సీపీ గౌస్ ఆలం


కంట్రోల్‌రూంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుం టున్న ట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొ న్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన 769 సీసీ టీవీ కెమెరాలు జూన్ 27వ తేదీ నుంచి పూర్తిగా అందుబాటులోకి వచ్చాయని, ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పర్యవేక్షిస్తామని, తదను గుణంగా చలాన్లు జారీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం గురువారం కమాండ్ కంట్రోల్ రూంను సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, కరీం నగర్ ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి జాగ్రత్తలు, సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, సీఐలు ఖరీముల్లాఖాన్, రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

హుజూరాబాద్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని అన్ని వార్డులను సందర్శించి, ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సక్రమంగా వస్తున్నారా, ఆరోగ్య మహిళ, శుక్రవారం సభల కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మధుకర్, ఎంపీఈవో సునీత, ఎంపీవో సతీష్, ఏపీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల వంటావార్పు


విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టిజన్ కార్మికులు

గణేశ్‌నగర్,జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్, ఒకే సంస్థలో ఒకే రూల్స్ అమలు చేయాలని కోరుతూ టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సంస్థలో ఆర్టిజన్ కార్మికులు అంకిత భావంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎంతో మంది కార్మికులు విద్యుత్ ప్రమాదాలకు గురై చనిపోగా కొంతమంది రిటైర్ అయ్యారని, ఎటువంటి బెనిఫిట్ లేకుండా బాధతో సంస్థ నుంచి పదవీ విరమణ చేశారన్నారు. జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్ కందికొండ వెంకటేష్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి స్వామి, 1535 యూనియన్ రీజినల్ అధ్యక్షుడు చందర్‌సింగ్, హెచ్ 82 యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా చైర్మన్ శివ కృష్ణ, టీవీఎసి జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రఘునాథరెడ్డి ఉన్నారు.

## అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాలు

### కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, శిక్షణకు హాజరైన విద్యార్థులు

కరీంనగర్ క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి):అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరు గుతున్నాయని, విపత్తుల నుంచి ప్రజల ను రక్షించేందుకు ఆపదమిత్ర వలంటీర్లు ముందుండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో 142 మంది డిగ్రీ విద్యార్థులు, ఎన్‌సీసీ వలంటీర్లకు కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో 12 రోజుల పాటు ఆపదమిత్ర శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ఆపదమిత్ర వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమా దాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలు ఎదుర్కొనేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వలంటీర్లకు మొదటి విడతలో శిక్షణ ఇచ్చామని తెలిపారు.

రెండో విడతలో డిగ్రీ విద్యార్థులు, ఎన్‌సీసీ వలంటీర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసు కున్నారని అన్నారు. శిక్షణలో భాగంగా ఫైర్, పోలీస్, పంచాయతీరాజ్, వైద్యశాఖ, పశుసంవర్థక శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి విపత్తునూ ఎదుర్కొనే విధంగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము, కుక్కకాటు, అగ్నిప్రమాదం, సీపీఆర్, షాట్ సర్క్యూట్, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఆపద మిత్ర వలంటీర్లు ముందుండి ప్రజల ప్రాణాలను రక్షించాలని అన్నారు.

నైపుణ్యాలతో కూడిన ఆపదమిత్ర శిక్షణతో తమను తాము రక్షించుకోవడంతో పాటు పది మంది ప్రాణాలు కాపాడగలరని పేర్కొన్నారు. నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని సూచించారు. ఆపద ఎప్పుడైనా రావచ్చని ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడంలోనూ ఆపద మిత్రులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఎం శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్మార్ట్ సిటీ నిధులతో నూతనంగా నిర్మించే భవన నిర్మాణంపై గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో చర్చ జరిగింది. సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం నిర్మాణ పనుల పురోగతిపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వివరించారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయించాలని కమిషనర్‌ను కోరారు. నిర్మాణం పూర్తయితే పాఠకులకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు నెలల్లో నూతన భవన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. అలాగే ఎస్టిమేషన్ ప్రక్రియ పూర్తయినందున గ్రంథాలయ ఆవరణలో రంగులు, వెలుపల గోడలకు రంగులు, చిత్రాలు వేసే పని కూడా వారంలోగా పూర్తి చేయాలని తెలిపారు.

## మహిళా చట్టాలను బలోపేతం చేయాలి


నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ మహిళా కమిటీ సభ్యులు

గణేశ్‌నగర్,జూలై17(ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, కేంద్ర ప్రభుత్వం మహిళా చట్టాలను బలోపేతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ యం. పూజ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినిలకు రక్షణ లేదన్నారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన నుంచి మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి అసెంబ్లీ వినయ్ సాగర్, నాయకులు అక్షయ్, మానస, మమత, రమ్య, జ్యోతి, వరలక్ష్మి, రేఖ, శ్రీజ, సంజన, నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాలకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


కొత్తపల్లిలో మహిళా సంఘాలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రాబోవు రోజుల్లో వందశాతం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకే అప్పగిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంది రా మహిళాశక్తి సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు కోటీశ్వరులు కావాలన్నదే ప్రభుత్వధ్యేయం అన్నారు. అనంతరం మహిళా సంఘాలకు ప్రభుత్వం నుంచి విడుదలైన వివిధ పథకాలకు సంబంధిం చిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ వెంకట్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


గంగాధరలో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధరలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మహిళాశక్తి సంబరాలకు ఆయన హాజరై మహిళ సంఘాలకు బ్యాంకు లింకేజీ, ప్రమాదబీమా, లోన్‌బీమా, స్కూల్ యూనిఫాం కుట్టిన మహిళలకు, మహిళా సంఘాలకు, ఆర్టీసీ బస్సులకు సంబంధించి సుమారు రూ. 95.46కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మహిళలకు ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు, ఐకేపీ సెంటర్లు ఇలా ఏ అవకాశం ఇచ్చిన అద్భుతంగా చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వేణు మాధవరావు, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ బాలస్వామి, ఏడీఆర్డీవో రవి కుమార్, చొప్పదండి, గంగాధర, రామడుగు, బోయినపల్లి మండలాల ఏఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

## కేసీఆర్ చేసిన పనులతోనే సిట్ నోటీసులు

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కేసీఆర్ చేసిన పనులతోనే సిట్ నోటీసులు అందుకోవాల్సి వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం సిట్ నోటీసులపై ఆయన మాట్లాడారు. తనతోపాటు కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను సైతం ట్యాప్ చేశారన్నారు. భార్యాభర్తలు పడకగదిలో మాట్లాడుకునే మాటలను సైతం ట్యాప్ చేసి ఎంతోమంది జీవితాలను నాశనం చేసిన కుటుంబం కేసీఆర్‌దే అన్నారు. తనకు తెలిసిన సమాచారాన్ని సిట్‌కు అందజేస్తానన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌పై వ్యవహారంపై మొట్టమొదట గళం విప్పింది తానే అన్నారు. తనతోపాటు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, జడ్జిలు, ప్రతిపక్షపార్టీల నాయకులు, సినీతారలతో పాటు, బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను కూడా కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేసిందన్నారు. పదో తరగతి పేపర్ లీక్, 317 జీవో సవరించాలంటూ చేపట్టిన దీక్షను భగ్నం చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ ద్వారానే సమాచారం తెలుసుకున్నారన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు గొప్ప నిర్ణయం

● రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా నిర్ణయం తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కేబినేట్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా బీసీ సామాజికవర్గ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల సంక్షేమంకోసం చేసిన పనులు ఏమిటోచెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు అడ్రస్‌లేకుండా పోయిందని విమర్శించారు. బీసీలపై ప్రేమ ఉంటే బీసీ నేతను బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడిగా నియమించాలి కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నోకష్టాలను ఎదుర్కొని అధికారంలోకి వచ్చిందని, పార్టీలో వ్యక్తిగత కోపాలు పీరాయింపులకు చోటు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇతరపార్టీలు మనలో ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, కార్యకర్తలు అపోహలకు లోనుకాకుండా పార్టీపై నిబద్ధతతో ముందుకు సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎమ్మెల్సీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకాంగ్రెస్ వ్యవసహారాల ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీని ఎదుర్కొనే సత్తా ఎవరికి లేదని అన్నారు. ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు, నిరుపేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ, అనేక సంక్షేమపథకాలు చేపట్టి సఫలీకృతుడయ్యాడని ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు అన్నిరంగాల్లో ముందుకు దూసుక వెళుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బలుమూరి వెంకట్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేసన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, గాలి అనిల్‌కుమార్, అంజన్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, రుద్ర సంతోష్, రహమత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీల పూజలు



ధర్మపురి నరసింహుడి సన్నిధిలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ దంపతులు

ధర్మపురి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ దంపతులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గురువారం సందర్శించారు. ఆలయంవద్ద వారికి వేర్వేరుగా వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణులు ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారిద్దరికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అంతకుముందు వారు యమధర్మరాజు ఆలయంవద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలోని తోటలో పేకాట అడుతున్న ఏడుగురిని అరెస్టు చేయగా ఒకరు పరారీ ఉన్నట్టు ఎస్ఐ ఆశోక్‌కుమార్ గురువారం తెలిపారు. జిల్లా సీసీఎస్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు పేకాట అడుతున్న వారిని గుర్తించి దాడి చేసినట్టు ఎస్ తెలిపారు. వారివద్ద 3,690రూపాయలు, ఏడు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

## జ్వరంతో యువకుడి మృతి

మల్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేటకు చెందిన నేరెళ్ల సాయికుమార్(22) అనేయువకుడు తీవ్రజ్వరంతో భాదపడుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న సాయికుమార్ జ్వరం బారినపడడంతో చికిత్స కోసం బుధవారం గ్రామానికి వచ్చి స్థానికంగా వైద్యం పొందాడు. జ్వరం తగ్గకపోవడంతో జగిత్యాలలోని ప్రైవేట్‌ఆసుపత్రులకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించి అదేరోజు రాత్రి మృతిచెందాడు.

# తపాలా కార్యాలయాల్లో ఆధునిక సాంకేతికత




● సేవలు వేగవంతానికి చర్యలు
● కరీంనగర్ డివిజన్‌లో ఈ నెల 22 నుంచి ప్రారంభం

భగత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భారతీయ తపాలా శాఖ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ మరో ముందడుగు వేయనున్నది. రాష్ట్ర తపాలా శాఖ సర్కిల్, రీజినల్ కార్యాలయాల ఆదేశాల మేరకు కరీంనగర్ డివిజన్‌లోని అన్ని కార్యాలయాల్లో ఐటి 2.0 సాంకేతికతను అందుబాటులోకి తేనున్నారు. భారతీయ తపాలా శాఖ కొత్త సాంకేతికతను రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే నల్గొండ డివిజన్, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్‌లలో జూలై 8వ తేదీన ప్రారంభించారు. మిగతా జిల్లాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ప్రస్తుతమున్న రెండు హెడ్ పోస్టాఫీసులు, 52 సబ్ పోస్ట్ ఆఫీసులు, 389 బ్రాంచి పోస్టాఫీసుల్లో కొత్త అధునాతన సాంకేతికతను అమలు చేయనున్నారు.

### డిజిటల్ సదుపాయాలు

తపాలా శాఖ ఆధ్వర్యంలో 2.0 సాంకేతికతతో పార్సిల్, సీఓడీ, వీపీపీ వంటి సేవల బట్వాడా వేగవంతమవుతుంది. దీనితో డిజిటల్ సిగ్నేచర్, ఆధునిక డిజిటల్ సదుపాయాలు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి. తపాలా శాఖలో సేవల వేగవంతానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

### ఆధునికీకరణ పనులతో లావాదేవీలకు అంతరాయం

కె శివాజీ, సూపరింటెండెంట్, పోస్టల్, కరీంనగర్



తపాలా శాఖలో కొత్తగా చేపట్టనున్న 2.0 సాంకేతికత, ఆధునికీకరణ పనులతో ఈ నెల 18, 19 తేదీల్లో తయారీ పనులు, 21న పూర్తి స్థాయిలో తపాలా లావాదేవీలు నిలిపి వేయనున్నట్లు తపాలా శాఖ కరీంనగర్ సూపరింటెండెంట్ శివాజీ తెలిపారు. ప్రజలు, వినియోగదారులు తమ తపాలా లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ మార్పు వల్ల తాత్కాలికంగా కొంత అసౌకర్యం కలుగవచ్చని, వాటిని సమర్థవంతంగా అధిగమించి మెరుగైన సేవలు అందించేందుకు ఇది ఒక పెద్ద ముందడుగు అన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలే బుద్ధి చెబుతారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

● 42శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరోసారి ఘరానా మోసం
● తెలంగాణలో చంద్రబాబునాయుడు కోవర్టు పాలన
● బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

సిరిసిల్ల జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీ సోదరులే రేవంత్‌రెడ్డికి బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లాకార్యాలయ భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతి బీరకాయలో నేతి ఎలాగ లేదో కాంగ్రెస్ బీసీడిక్లరేషన్‌లో చిత్తశుద్ధి కూడా గంతే అని అన్నారు. బీసీలను మరోసారి ఘరానా మోసం చేస్తున్నాడన్నారు. గతంలో అసెంబ్లీలో రేవంత్ రెడ్డి స్వయంగా 42శాతం రిజర్వేషన్ విద్య, ఉపాధి, రాజకీయాల్లో రావాలంటే పార్లమెంట్ ఆమోదం కావాలని, రాష్ట్రపతి సంతకం పెట్టాలని మాట్లాడాడన్నారు. రేవంత్‌రెడ్డి కాగితం ఇస్తే.. బీజేపీ గవర్నర్‌కు ఆర్డినెన్స్ ఇస్తేకాదని రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్లో పొందుపరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్నారు. గోదావరి, కృష్ణజలాల్లో తెలంగాణ వాటా, హక్కులు తేల్చకుండా కమిటీ వేద్దామని అనగానే తల ఊపడానికి గోదావరి నీళ్లు రేవంత్‌రెడ్డి అబ్బసొత్తు కాదు, తాత జాగిరి కాదని అన్నారు. ఎవరిని అడిగి ఢిల్లీలో కమిటీకి ఒప్పుకొని వచ్చావు.. చంద్రబాబు మీద ప్రేమ ఉంటే నీ ఇల్లు అమ్మి విగ్రహం పెట్టుకోవాలని అన్నారు.

తెలంగాణకు రావల సిన గోదావరి, కృష్ణ జలాల వాటా తేలకుండానే గోదావరి జలాలు చంద్రబాబుకు తర్పణం చేయడంపై తెలంగాణ ప్రజలు ఆక్రోశిస్తున్నారన్నారు. 48గంటలముందు బనకచర్ల అంశంపై వెళ్లబోమని చెప్పినా 24గంటల్లోనే చంద్రబాబు నాయుడును కలవడానికి ఢిల్లీ వెళ్లి ఎవరి అబ్బ సొత్తని, నీ తాత జాగిరి అని గోదావరి జలాలపై తల ఊపి వచ్చావని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల్లో చైతన్యం ఉందని, కేసీఆర్, బీఆర్ఎస్ ఉందనే విషయం మర్చిపోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టు పాలన నడుస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌పార్టీకి ఉప్పు పాతరవేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బనకచర్లను తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని దానికి అనుకూలంగా వైఖరిమార్చుకోవాలని లేదంటే తెలంగాణ ఉద్యమంలాగానే మరో ఉద్యమం తప్పదన్నారు.

నోటుకు ఓటు కేసు ఉందని చంద్రబాబు ఫుట్‌బాల్ లాగా ఆడిస్తామంటే వ్యతిరేకిస్తామన్నారు. కేసీఆర్ మీద కోపంతో కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయకుండా మిడ్ మానేరు ప్రాజెక్టును ఎండబెట్టి పంటలకు నీళ్లు ఇవ్వకుండా ఎండబెడుతున్నారన్నారు. సమావేశంలో నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ మాజీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రాంమోహన్, మాజీ జడ్పీ టీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, నాయ కులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

తిమ్మాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటవద్ద గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండుట్రాక్టర్లు, రెండు పికప్‌వాహనాలను పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. పట్టుకున్నవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనాలకు సంబంధించిన యాజమానులు, డ్రైవర్లు అయిన గీకురు అజయ్, గూడెల్లి అనిల్, అలువల కిషన్, కర్ర రాజు, కనకుంట్ల వినయ్, బొంగోని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు పట్టుకున్న వాహనాలు

## సాగునీటిని విడుదల చేయాలని రైతుల రాస్తారోకో



పొత్తూరు వంతెనపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇల్లంతకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటిని విడుదల చేయాలంటూ మండలంలోని పలు గ్రామాల రైతులు రాస్తారోకో చేపట్టారు. మధ్యమానేరు కుడికాలువ ద్వారా సాగునీటిని అందించాలని డిమాండ్ చేస్తూ పొత్తూరు గ్రామసమీపంలోని వంతెనపై గురువారం రైతులు నిరసనకు దిగారు. రైతుల నిరసనకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు మాట్లాడుతూ సరైన వర్షాలు కురియకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొంతమంది రైతులు ఇప్పటివరకు నాట్లు వేయలేదని, మరికొందరి రైతుల చేన్లు ఎండిపోతున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడు ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదన్నారు. రైతులు కోరినప్పుడు నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రైతులు అనేక రోజులుగా సమస్యను వివరిస్తున్నా ఇంతవరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ ఇప్పటికైనా స్పందించి కుడికాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మధ్యమానేరును ముట్టడిస్తామన్నారు. దాదాపు రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టడంతో వంతెనపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో శాంతించి నిరసన విరమించారు. కార్యక్రమంలో నాయకులు కేవీఎన్‌రెడ్డి, సిద్దం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్‌లతో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షకు దరఖాస్తు గడువు 29

చొప్పదండి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల29న ముగుస్తుందని ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్13న జాతీయ స్థాయిలో ప్రవేశపరీక్ష జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులని ఆమె తెలిపారు.

## రూ.7700 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7700 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ముగ్గురు రైతులు 34క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7700, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

## 20న ఉమ్మడి జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు పోటీలు

మార్కండేయకాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు అర్హులైన అభ్యర్థులకు ఈనెల 20న గోదావరిఖని ఫైటింక్లయిన్‌కాలనీలోని ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఫుట్‌బాల్ కిట్‌తో ఉదయం 7గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9550903088, 9908839896 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రమేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాని పరిచయం చేసుకొని వెంటపడి మోసగించాడు. పెళ్లి చేసుకోవాలని యువతి రమేష్‌ను కోరగా నిరాకరించాడు. దీంతో సదరు యువతి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన మామిడి రాజయ్య భూ తగాదాలో అదే గ్రామానికి చెందిన వావిలాల సత్తయ్యపై పారతో దాడిచేశాడు. దీంతో సత్తయ్యకు బలమైన గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. సత్తయ్య భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## గుడుంబా తయారీదారుల బైండోవర్

ముత్తారం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి, మచ్చుపేట, తెనుగుపల్లి గ్రామాలలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గతంలో నాటుసారా అమ్ముతూపట్టుబడిన సిద్ధరాజేశ్వరి, నల్లాల నందు, నక్క రమేష్, నలివేల ప్రసాద్‌లను తహసీల్దార్ ఎదుట లక్షరూపాయల వ్యక్తిగత పూచికత్తుతో బైండోవర్ చేశారు.

# ప్రభుత్వం మెడలు వంచి రూ.6వేల పింఛన్ సాధిస్తాం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మెడలువంచి దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, గీత, చేనేత, బీడీ కార్మికులకు రూ.4వేల చేయూత పింఛన్ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని కళాభారతిలో వచ్చేనెల13న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాగర్జన సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు అయ్యిందని, ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు రూ. 6వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. ఇచ్చిన హామీని ఇంతవరకు నెరవేర్చలేదని, దీంతో దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులు నెలకు రెండువేల చొప్పున ఒక్కొక్కరు ఇప్పటి వరకు 40వేల రూపాయలను నష్టపోయారని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పొందుపర్చకున్నా అక్కడి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి అమలు చేయించినట్లు చెప్పారు. కండరాల నొప్పితో బాధపడుతున్నవారికి ఏపీలో నెలకు పదివేల రూపాయలు పింఛన్ ఇస్తున్నారన్నారు. దివ్యాంగుల, చేయూత పింఛన్ పెంచకుండా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి మళ్లించిందని ఆరోపించారు. కళ్లు, కాళ్లు లేనివారికంటే భూములున్నవారికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చినమాట తప్పిందని, దానిని ప్రతిపక్షం నిలదీయడం లేదని అన్నారు. అందుకే తాను ముందుకువచ్చినట్లు చెప్పారు. తానుపేదరికం నుంచి వచ్చానని, పేదలబతుకులు, బాధలు తనకు తెలుసని అన్నారు. తన పోరాటంతోనే దివ్యాంగులకు నెలకు రూ.1,500పింఛన్, ఆరోగ్యశ్రీపథకం సాధించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న పింఛన్ ఆగస్టునుంచి అమలు చేయాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు.

## ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

కాల్వశ్రీరాంపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం గ్రామంలో పులిపాక సంపత్(32) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని కాల్వశ్రీరాంపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పులిపాక సంపత్ స్వగ్రామం కమాన్‌పూర్ మండలం రొంపికుంట కాగా, కూనారం గ్రామానికిచెందిన దొడ్ల రాజేశ్వరిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. అతడిమృతిపై పలుఅనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులను వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని వారు పేర్కొన్నారు.

## అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నంమండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన వెంగళ పోచమ్మ(42) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఈనెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు పోచమ్మ భర్త సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్(ఫైల్)

ఎలిగేడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి నరేష్(34)చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రం తెలిపారు. కొన్నేళ్లుగా మద్యానికి బానిసైన నరేష్ ఈ నెల 15నగ్రామసమీపంలోని కోమటికుంట వద్ద మద్యం మత్తులో గడ్డిమందు తాగాడు. విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పడంతో అతని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పేర్కొన్నారు. భార్య లావణ్య, కొడుకు రిషిత్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

# ఆయిల్‌పామ్ సాగుతో మంచి ఆదాయం

● ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్



ఆయిల్‌పామ్ గెలలతో అధికారులు

బోయినపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ సాగు ద్వారా ఏడాదికి లక్షా యాభై వేల రూపాయల వరకు నికర ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ డిప్యూటీడైరెక్టర్ టి శేఖర్ తెలిపారు. బోయిని పల్లి మండలం మర్లపేటలో ఆయిల్‌పామ్ తోటలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పంటతో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి రైతుకు కేవలం రూ.20కే మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎకరాకు రూ.4200వరకు సబ్సిడీ మంజూరవుతుందని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా విస్తృతంగా రాయితీలు అందుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీ, చిన్నకారు రైతులకు 90శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీ లభించనుందని చెప్పారు. జిల్లాలో నీటి వనరులు, నేల తేమ అందుబాటులో ఉన్నాయి. ఆయిల్‌పామ్ పంటకు ఇవి అనుకూలంగా ఉంటాయి. కాబట్టి రైతులు ముందుకువచ్చి ఈ సాగు చేపట్టాలని శేఖర్ రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయిల్ పామ్ గెలల కోతను పరిశీలించిన ఆయన, పంట దిగుబడి, మార్కెట్‌అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్‌సాగు ద్వారా రైతుల ఆర్థిక స్థితిలో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత మాట్లాడుతూ జిల్లాకు ఈ సంవత్సరం ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం 2000 ఎకరాలు, అయితే ఇప్పటికే పెద్దఎత్తున రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లోకేష్, గోవర్ధన్, ఏఓ ప్రణీత, ప్రీయూనిక్ కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.

చింతన

# అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

### తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



### ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220

---

ఆలయ దర్శనం



# యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



### వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

**ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.**

### అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎస్.మూర్తి
8328143489

---

సందేశం


# కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.

• మహమ్మద్ వహీదుద్దీన్


---

సహజయోగ

# భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

**భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.**

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



### అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

### అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

---

దైవమార్గం

# అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తాకోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్తులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,



**అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.**

వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024


---

జెన్ కథ

# మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కోషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి.... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క, అతను వెళ్ళి పోతూ ఉంటే... రేకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్షిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు

# నిరుపయోగంగా మానకొండూర్ బస్టాండ్

**- ప్రారంభించి 25 ఏళ్లు - నాటి నుంచి అదే పరిస్థితి**



మానకొండూర్ ఆర్టీసీ బస్టాండ్

మానకొండూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించిన 25ఏళ్ల నుంచి ఉపయోగంలో లేదు. 20 సెప్టెంబరు 2000 సంవత్సరంలో అప్పటి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సీహెచ్ విద్యాసాగర్‌రావు, హన్మకొండ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, కమలాపూర్ ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్‌రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్యే కఠారి దేవేందర్‌రావు ఈ బస్టాండ్‌ను ప్రారంభించారు. నాడు ఈ బస్టాండ్ ఊరికి దూరంగా ఉండేది. ప్రస్తుతం ఇక్కడి దాకా ఇళ్లు నిర్మాణమ య్యాయి. పోలీసుస్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాల యం, పీహెచ్‌సీ, అగ్నిమాపక కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైతువేదిక, విద్యుత్ సబ్‌స్టేషన్, ఐకేపీ, మార్కెట్ కార్యాలయాలు బస్టాండ్‌కు దగ్గర ఉన్నాయి. అయినప్పటికీ బస్టాండ్‌ను ఉపయోగంలోకి తేవడం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రాత్రి వేళల్లో బస్టాండ్ మందుబాబులకు అడ్డాగా మారుతోంది. కొన్ని సంవత్సరాలుగా బస్టాండ్‌లోని రూములను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారే తప్ప బస్సులను మాత్రం బస్టాండ్‌కు తరలించడంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్లకిరువైపులా చెత్తాచెదారం

**- గ్రామాల్లో కనిపించని స్వచ్ఛత**
**- అధికారుల పర్యవేక్షణ కరువు**



ఇరుకుల్ల ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్ప

కరీంనగర్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాలతో పాటు, విలీన మైన గోపాల్‌పూర్, బొమ్మకల్, దుర్శేడ్ గ్రామాల్లో స్వచ్ఛత కరువైంది. పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తున్నా కనిపించడం లేదు. రహదారులకు ఇరువైపులా చెత్తాచెదారం, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. తీగలగుట్టపల్లి నుంచి వల్లంపహాడ్‌కు వెళ్లే దారి, దుర్శేడ్ నుంచి చేగుర్తికి వెళ్లే రోడ్డు, ఇరుకుల్ల బ్రిడ్జి కింద, వల్లపంహాడ్ బ్రిడ్జి పక్కన ఇలా ప్రధాన రహదారుల వెంట చెత్తను ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కొందరు స్వచ్ఛ ఆటో నిర్వహకులు సైతం చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. ఆయా వ్యర్థాలు వర్షాలకు తడిచి దుర్వాసనతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో అధికారులు వచ్చిన సందర్భంలో కింది స్థాయి సిబ్బంది అక్కడి నుంచి తొలగిస్తున్నారు. మరోవైపు ఇరుకుల్ల బ్రిడ్జి వద్ద వేసే చెత్తతో వాగులో నీరు కలుషితం అవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, చెత్త వేయకుండా జరిమానా విధించాలని కోరుతున్నారు.

## ● సంక్షిప్తంగా..

**చొప్పదండి:** ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం దారుణమని మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రకనటలో పేర్కొన్నారు.

**సైదాపూర్:** వెన్కేపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్ పరిశీలించారు.

**గంగాధర:** ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని గంగాధర రైతులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందించారు.

**రామడుగు:** వెదిరలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు.

**భగత్‌నగర్:** రేకుర్తిలోని కంటి ఆసుపత్రిలో 47 మంది పేదలకు ఉచితంగా కాటరాక్ట్ చికిత్స చేశారు.

**సుభాష్‌నగర్:** మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కోతిరాంపూర్‌లోని కొటక్ మహీంద్రా బ్యాంకులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

**సైదాపూర్:** మండలంలోని గుజ్జులపల్లి, రాములపల్లిల్లోట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ గురువారం పొలంబాట నిర్వహించారు.

**గన్నేరువరం:** మండలానికి మంజూరైన పీఎచ్‌సీని మండలకేంద్రంలోనే ఏర్పాటు చేయాలని వివేకానంద యూత్ అధ్యక్షుడు గూడూరి సురేష్ డిమాండ్ చేశారు. గురు వారం మండల కేంద్రంలో మాట్లాడారు.

**ఇల్లందకుంట:** మండలకేంద్రంలో సీతారామచంద్రస్వామి ఆలయ హుండీని ఈ నెల 25న ఉదయం 10గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కందుల సుధాకర్ గురువారం తెలిపారు.

**రామడుగు:** రామడుగులో రజకసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మడేలేశ్వర స్వామి బోనాల ఉత్సవాలకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పరశురామ్‌గౌడ్ రూ.6వేల విలువైన 4 హైమాస్ట్ లైట్లను అందించారు.

**తిమ్మాపూర్:** తనకు నామినేటెడ్ పోస్టు ఇప్పించాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్‌కుమార్ గురువారం ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

**కరీంనగర్ కల్చరల్:** జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కన్న కృష్ణ ప్రకటనలో తెలిపారు.

**గంగాధర/గన్నేరువరం:** గంగాధర మండలం కాసారం, గన్నేరువరం మండలం మెలారంలో గురువారం చిన్నారులు కప్పతల్లి ఆట ఆడారు. వానదేవుడు కరుణించాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ పీజీటీ పోస్టుకు గంటల ప్రాతిపాదికన పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 60శాతం మార్కులతో పాసై బీఈడీ పూర్తిచేసి టెట్‌లో అర్హతపొంది ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 19 సాయంత్రం4 గంటలలోగా సోమారం మోడల్ స్కూల్‌లో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ నెల 22న ఉదయం 10గంటలకు డెమో ఉంటుందని, వివరాలకు 9014964242 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# వైద్యాధికారులు సమయపాలన పాటించాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

హుజూరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం హుజూరాబాద్ ఏరియాఆస్పత్రిలో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఉదయం 9నుంచి సాయత్రం 4గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. ఆరోగ్య మహిళా శుక్రవారం సభలను నిర్వహించి, మహిళలందరికి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఆస్పత్రుల్లో గర్భిణులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. డీసీహెచ్‌ఎస్ కృష్ణప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఈపీఎఫ్‌వో ఉద్యోగులకు ప్రోత్సాహక పథకం

సుభాష్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తయారీ రంగంతోపాటు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని(ఈఎల్ఐ) రూపొందించిందని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ మహ్మద్ ఫజియుద్దీన్ తెలిపారు. గురువారం ఈపీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పథకానికి సంబంధించిన వివరా లను తెలియజేశారు. మొదటిసారిగా ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకున్న ఉద్యోగులకు వారి ఒక నెల ఈపీఎఫ్ వేతనం మొత్తాన్ని 15 వేల వరకు రెండు విడతల్లో అంది స్తామని తెలిపారు. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకు కొత్తగా చేరిన ఉద్యోగులకు ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని తెలిపారు.

# 23న విద్యాసంస్థల బంద్

భగత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. గురువారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని అన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని అన్నారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

సుభాష్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): దేశ కరెన్సీపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పర్శరాం డిమాండ్ చేశారు. జూన్ 23న ఉస్మానియా యూనివర్సిటీలో ప్రారంభమైన పోస్టుకార్డు యాత్ర గురువారం కరీంనగర్‌కు చేరుకుంది. కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. పార్లమెంట్ శీతాకాలం సమావేశాల్లో అంశాన్ని లేవనెత్తడానికి జంతర్‌మంతర్‌లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపై విచారణ చేపట్టాలి

కరీంనగర్ టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతిపైనా, మాజీ మేయర్ సునీల్‌రావు అక్రమ ఆస్తులపైనా ఏసీబీ అధికారులు విచారణ చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల్లో పూర్తిగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు.

# ఆల్ ఇండియా చెస్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు మూడో ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అత్యధిక పతకాలు సాధించారు. గురువారం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన అయాన్, ప్రణవ్ ఆదిత్య, ఆర్.శివనామ శ్రగ్న, డి.శ్రీతన్, ఎండీ షయాన్ ఖాన్, విహాన్ నాయక్, రుద్రాన్ష్, ఎస్.రావిక్, సహ్నాయా కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో అధికార దుర్వినియోగం

సుభాష్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికార దుర్వినియోగం, అవినీతి జరిగాయని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. గురువారం ప్రజామిత్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏసీబీ అధికారులు రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌రావుపై జరిపిన దాడుల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూసినట్లు ఆరోపించారు. దాదాపు 500 కోట్ల రూపాయల విలువచేసే అక్రమ ఆస్తులు అతడి ఆదీనంలో ఉన్నట్లు గుర్తించారన్నారు. గతంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్ నాయక్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ ఈ ముగ్గురి ఆస్తులు రూ. 1,000 కోట్లకుపైనే ఉంటాయని ఏసీబీ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అధికారుల అవినీతి ఇలా ఉన్నప్పుడు, అప్పుడు అధికారంలో ఉన్న పెద్దల వివరాలపై ఈ ప్రభుత్వం ఎందుకు దర్యాప్తు చేయించడంలేదని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, సంతోష్‌రావుతోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి గురించి కాంగ్రెస్ పెద్దలు పలుమార్లు మాట్లాడారని, ఆ సొమ్మంతా ఏ దేశాల్లో దాచుకున్నారో దర్యాప్తు చేయించాల్సిన బాద్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.

## కాంగ్రెస్ శ్రేణుల్లో ఆశలు

(5వ పేజీ తరువాయి)

కొంత ఫైనస్‌గా మారింది. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న రెడ్డి కరీంనగర్ డీసీసీ అధ్యక్ష పదవిని తనకు అప్పగించి మహిళలకు పార్టీ ఇస్తున్న గుర్తింపును చాటాలని కోరుకుంటున్నారు. అటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఇటు మరో మంత్రి శ్రీధర్‌బాబు ఆశీస్సులు ఎవరికి దక్కుతాయో, అధిష్ఠానవర్గం ఎవరిని అక్కున చేర్చుకుంటుందోనన్న ఆసక్తి కాంగ్రెస్ పార్టీలో నెలకొన్నది.

### ఉద్యమకారుల సంక్షేమానికి కృషి

ఇల్లందకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఇల్లందకుంట మండల అధ్యక్షుడిగా రావుల రాజబాబుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు, పెన్షన్ అమలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యక్షుడిగా రేణికుంట్ల లచ్చన్న, కార్యదర్శిగా గురుకుంట్ల రాజీర్, నియోజకవర్గ కార్యదర్శిగా రమేష్‌రెడ్డిని నియమించారు.

### పార్టీ కోసం కష్టపడేవారికి న్యాయం చేయాలి

కరీంనగర్ అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులకున్యాయం చేయాలని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ సంస్థాగత సమావేశానికి వచ్చిన ఎమ్మెల్సీ ఉమ్మడి జిల్లా టీపీసీసీ ఇన్‌చార్జి అద్దంకి దయాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తాను రెండు దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడుతున్నానని, తనకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అవకాశం కల్పించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



సహాయం అందజేస్తున్న తహసీల్దార్లు

హుజూరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన బుర్ర సుదర్శన్ ఇటీవల కోతుల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం ట్రస్మా యూనియన్ తరుపున జమ్మికుంట, హుజూరాబాద్ తహసీల్దార్లు వెంకట్ రెడ్డి, కనకయ్య రూ.20వేలను కుటుంబసభ్యులకు అందించారు.

### రోహిత్‌రావుకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

కరీంనగర్ అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఎమ్మెస్సార్ మనుమడు, టీపీసీసీ అధికార ప్రతినిధి మన్నెని రోహిత్ రావును గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి మెన్నేని సత్యనారాయణరావు సతీమణి సుగుణ మరణించగా గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో దహనం సంస్కారలు అయ్యాయి. బంజారా హిల్స్‌రోడ్ నంబరు 12 ఎమ్మెల్యే కాలనీలో ఎమ్మెస్సార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ మైనార్టీ చైర్మన్ మెహమ్మద్ తాజొద్దీన్, నాయకులు ఉన్నారు.

### అర్బన్ బ్యాంక్ ఓటర్ల జాబితా విడుదల

కరీంనగర్ టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల సహకార అర్బన్ బ్యాంకుల ఓటర్ల జాబితాను సీఈఓ గురువారం విడుదల చేశారు. ఓటర్ల జాబితాను కరీంనగర్, జగిత్యాల అర్బన్ బ్యాంక్ ఆవరణలోని నోటీసుబోర్డులో ఈ నెల 19వ తేదీ వరకు ప్రదర్శన నిమిత్తం అందుబాటు ఉంచామని, అభ్యంతరాలుంటే 19వ తేదీలోగా తెలియపర్చాలని పేర్కొన్నారు.

### శస్త్ర పబ్లిక్ స్కూల్లో బ్లూ కలర్ డే

హుజూరాబాద్ జూలై 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్లో బ్లూకలర్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

### రక్తదానం చేసిన అడ్వకేట్

సుభాష్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా, గొల్లపల్లి మండలం చిల్వకోడూరుకు చెందిన రాజవ్వ గుండె సంబంధిత సమస్యతో కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అత్యవసరంగా రక్తం అవసరమవడంతో కుటుంబ సభ్యులు అడ్వకేట్ సెంట్రల్, స్టేట్ కోఆర్డినేటర్ అడ్వకేట్ నిసాని రాంచంద్రంను సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి 26 సార్లు రక్తదానం చేసినట్లు చెప్పారు.

### గాజుల రవీందర్‌కు పురస్కార ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రచయిత, జాతీయవాది, ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు గాజుల రవీందర్ ధార్మిక సాహిత్య పురస్కారం అందుకున్నారు. భాస్కర్ ఫౌండేషన్-పరిగి, వికారాబాద్ ఆధ్వర్యంలో ఏటా రాష్ట్ర స్థాయిలో ఇచ్చే పటేల్ శాంతమ్మ ధార్మిక సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. గురువారం పరిగిలో జరిగిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ అంజిరెడ్డి, రాజకీయ, సామాజిక, సాహిత్య విశ్లేషకుడు డాక్టర్ భాస్కరయోగి చేతుల మీదుగా అందుకున్నారు.

### వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై బాధిత కుటుంబం గురువారం డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసింది. వారి వివరాల ప్రకారం... దుర్శేడ్‌కు చెందిన అనూష-మహేష్ దంపతుల కూతురు మహిర(4 నెలలు)కు ఈ నెల 9న పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది పీఆర్‌వో, ఆర్వీవీ, పెంట వ్యాక్సిన్లు వేయాల్సి ఉంది. కొరత కారణంగా రెండు వ్యాక్సిన్లు మాత్రమే వేశారు. బుధవారం మూడోది తీసుకోవడానికి రాగా దీంతోపాటు 9వతేదీన వేసిన రెండు వ్యాక్సిన్లు ఇచ్చారు. ఈ విషయమై పాప తాత ఆర్ఎంపీ వైద్యుడు రాజమౌళి గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేయగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్, చామనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ విచారణ చేపట్టారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు.

### నైట్ వాచ్‌మన్‌ను తొలగించాలి

ఇల్లందకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్లో నైట్ వాచ్‌మన్ గడ్డి కొంరయ్యను విధుల నుంచి తొలగించాలని జిల్లా వారధి సొసైటీ సెక్రెటరీ ఆంజనేయులుకు గురువారం ఇలవేణి అనిల్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కొమురయ్య 15 రోజులు జైలుశిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చాడని, కేసు కోర్టుపరిధిలో ఉండగా మళ్లీ నైట్ వాచ్‌మెన్‌గా ఎలా చేస్తాడన్నారు.

### మానవత్వం పరిమళించిన వేళ

కరీంనగర్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆంజనేయస్వామి సేవా సమితి భజన మండలి బాధ్యుడు కొండమీది తిరుపతి మానవత్వం చాటుకున్నారు. బుధవారం బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద వృద్ధ యాచకుడు రక్తం కక్కుకొని స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన తిరుపతి 108కు ఫోన్ చేసి అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించాడు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేయగా కోలుకున్న సదరు వృద్ధుడు తన పేరు కిన్నెర కనకయ్య, తనది రామకృష్ణ కాలని అని చెప్పాడు.



భూమి పూజలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తిమ్మాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. మండలంలోని మహాత్మానగర్‌లో గురువారం అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా 1148 అంగన్‌వాడీ భవనాలు, 1144 గ్రామ పంచాయతీ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పాల్గొన్నారు.

**మానకొండూర్:** పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండంలోని కొండపల్కలలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇతర పార్టీల్లోని నిరుపేదలకు సైతం ఇళ్ల మంజూరు చేశామన్నారు. కొండపల్కల బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్‌కు మంజూరు చేయగా జీర్ణించుకోలేని ఆ పార్టీ అతడిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

**ఆదర్శంగా తీర్చిదిద్దుతాం**

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పచ్చునూర్‌లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. అనంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కెపాసిటర్లను బిగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి,

## బీజేపీకి గౌతమ్‌రెడ్డి రాజీనామా

హుజూరాబాద్/వీణవంక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీలో అంతర్గత అధిపత్య పోరు ఎక్కువైందని, ఈటల వర్గాన్ని ప్రణాళిక ప్రకారంగా అవమానాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీలో కార్యకర్తలకు గుర్తింపు లేదని, అందుకే బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

## అధ్యాపకురాలికి డాక్టరేట్

కరీంనగర్ రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి):కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు మోరె రాధిక గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఇటీవల రసాయన శాస్త్రంలో 'డిజైన్, సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ పైరిడిన్, పైపెరజిన్ అండ్ ఫినైల్ ప్రొఫియోనిక్ ట్రయజోల్ ఎనాలాస్ ఆజ్ యాంటికాన్సర్ అండ్ యాంటి మైక్రోబియల్ ఏజెంట్స్' అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. మాల కిషన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణ యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ అభినందించారు.

# జాన్సన్ గ్లోబల్, వాణినికేతన్ పాఠశాలల్లో లీడర్ల ఎన్నిక




జాన్సన్ గ్లోబల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, జూలై17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జాన్సన్ పాఠశాలలో విద్యార్థి మాక్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. పాఠశాలలోని వివిధ విభాగాల్లో లీడర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించున్నారు. డైరెక్టర్ హరికృష్ణ మట్లాడుతూ కార్యక్రమాలతో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటారన్నారు.

**కరీంనగర్ స్పోర్ట్స్:** నగరంలోని వాణినికేతన్ పాఠశాలలో గురువారం చైల్డ్ కేబినేట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల డైరెక్టర్ రేణుక హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం ఎన్నికలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, అకాడమిక్ అడ్వయిజర్లు హనుమంతరావు, నీలకంఠం, ఇన్‌చార్జి, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోనాల జాతరలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

# పాఠశాలల్లో బోనాల పండుగ

కరీంనగర్ కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గురువారం బోనాల పండుగను నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం పండుగ విశిష్టతను వివరించారు.

**భగత్‌నగర్:** కొత్తపల్లిలోని శారద విద్యానికేతన్‌లో విద్యార్థులు నెత్తిన బోనం, చేతిలో త్రిశూలంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బోగ భీమయ్య, మునీందర్, లింగమూర్తి, వి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలి

శంకరపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలని డీఈవో శ్రీరాం మొండయ్య అన్నారు. గురువారం శంకరపట్నం మోడల్ స్కూల్‌ను సందర్శించారు. వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మోడల్‌స్కూల్లో ప్రత్యేక శిక్షణ శిబిరం ఈనెల 9నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం బాలికల వ్యక్తిత్వ వికాసానికి మార్గనిర్దేశానికి ఉపయోగపడుతుందన్నారు.

● మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో వంటమనిషి రేణుక చపాతీలు చేయిస్తోందని విద్యార్థినులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సందర్శించినప్పుడు కంటతడిపెట్టిన విషయంపై డీఈవో విచారణ చేపట్టారు.